క్లుప్తంగా

ఖానాపూర్ సీడీపీవోగా శ్రీలత



ఖానాపూర్: ఖానాపూర్ సీడీపీవోగా గ్రేడ్–1 సూపర్‌వైజర్ శ్రీలత గురువారం అదనపు బాధ్యతలు స్వీకరించారు. కొద్దిరోజులుగా ఖానాపూర్ సీడీపీవోగా ఇన్‌చార్జి బాధ్యతలు స్వీకరించిన నిర్మల్ సీడీపీవో నాగలక్ష్మి స్థానంలో ఖానాపూర్ సూపర్‌వైజర్ శ్రీలత పూర్తిస్థాయి బాధ్యతలు స్వీకరించారు. సీడీపీవో మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది నెలవారీ సెక్టార్ సమావేశాలకు విధిగా హాజరై కేంద్రాల్లో సమయపాలన పాటించాలని కోరారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



సతీశ్‌ను సన్మానిస్తున్న గిరిజనులు

కడెం: మండలంలోని నచ్చన్‌ఎల్లాపూర్‌తండాలో హనుమాన్ ఆలయ నిర్మాణానికి నచ్చన్ ఎల్లాపూర్‌కు చెందిన ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ కానూరి సతీశ్ రూ.పది వేలను విరాళంగా అందజేశారు. ఈసందర్భంగా సతీశ్‌ను తండావాసులు సన్మానించారు. ఇందులో హనుమాన్ సేవా సమితి కన్వీనర్ బుర్ర రమేశ్‌గౌడ్ తదితరులున్నారు.

ప్రెస్‌క్లబ్ కార్యవర్గం

దిలావర్‌పూర్: మండలకేంద్రంలో గురువారం మండల ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బూస మచ్చేందర్, ప్రధాన కార్యదర్శిగా ఆ యిటి పోశెట్టి, గౌరవ అధ్యక్షుడిగా విజయ్‌రాజ్.. గౌరవ సలహాదారులుగా వెంకగారి భూమయ్య, దాసరి రామ్‌సాగర్, దుప్పి సిద్ధార్థ, కోశాధికారిగా సుఖేశ్, కార్యవర్గ సభ్యులుగా భోజన్న , ముత్యం ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని పలువురు అభినందించారు.

ఆయాలకు చీరలు పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న సిబ్బంది

ముధోల్: ముధోల్ ముధోల్ ఐసీడీఎస్ కార్యాలయంలో ప్రాజెక్టు పరిధిలోని లోకేశ్వరం, బాసర, తానూరు, ముధోల్ మండలాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పని చేసే ఆయాలకు గురువారం సీడీపీవో సరోజిని చీరలు పంపిణీ చేశారు. సీడీపీవో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆయాలకు(ఒక్కొక్కరికి) రెండు జతల చీరలు పంపిణీ చేసిందని పేర్కొన్నారు. సీనియర్ అసిస్టెంట్ విజయ్, సూపర్‌వైజర్లు అనిత, వీణ, ఉమా తదితరులున్నారు.

ఎస్టీయూటీఎస్ కార్యవర్గం



ఎన్నికైన కార్యవర్గం

సోన్: జిల్లాకేంద్రంలోని ఎస్టీయూ భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన సోన్ మండల కార్యవర్గ సమావేశంలో ఎస్టీయూ టీఎస్ మండల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలాధ్యక్షుడిగా రాపర్తి అశోక్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా ఎంసీ నర్సయ్య, ఆర్థిక కార్యదర్శిగా జెడ్డి పోశెట్టి, అసోసియేట్ అధ్యక్షుడిగా రాజ మహేందర్, కార్యదర్శిగా రాజేశ్వర్, జిల్లా కౌన్సిలర్ సభ్యులుగా తొడిశెట్టి పరమేశ్వర్, ఎం.శ్రీనివాసులు ఎన్నికయ్యారు. ఎన్నికల పరిశీలకులుగా వెంకటేశ్వరరావు, మఠం పరమేశ్వర్ వ్యవహరించారు.

ఏఎంసీ వైస్‌చైర్మన్‌కు పరామర్శ

లక్ష్మణచాంద: నిర్మల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఈటెల శ్రీనివాస్ తండ్రి భూమన్న ఇటీవల మృతిచెందగా బాధిత కుటుంబాన్ని గురువారం పలువురు పరామర్శించారు. మండలకేంద్రంలోని శ్రీనివాస్ ఇంటికి వెళ్లి మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు, బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా ఇన్‌చార్జి రాంకిషన్‌రెడ్డి పరామర్శించారు. డీసీసీబీ వైస్ చైర్మన్ రఘునందన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు రాజేశ్వర్, నిర్మల్ మున్సిపల్ మాజీ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు కృష్ణారెడ్డి, రాజేశ్వర్, సురేందర్‌రెడ్డి, రాంరెడ్డి, నారాయణ తదితరులు ఉన్నారు.

15న కార్యాలయం ముట్టడి

సోన్: మండలకేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో గురువారం చేయూత పెన్షన్‌దారులతో సమావేశం నిర్వహించినట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా కోఆర్డినేటర్ శనిగారపు రవి మాదిగ తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు వృద్ధులు, దివ్యాంగులు, బీడీ కార్మికుల పెన్షన్లు పెంచాలని ఈనెల 15న తహసీల్దార్ కార్యాలయం ముట్టడిస్తామని పేర్కొన్నారు. ఎమ్మార్పీఎస్ నాయకులు లక్ష్మణ్, సతీశ్‌కుమార్, దండుగుల పోశెట్టి, పెన్షన్‌దారులు పాల్గొన్నారు.

పత్తికి ఎర్రనల్లి బెడద

- మొక్కలను ఆశిస్తున్న తెగుళ్లు
- దిగుబడిపై ప్రభావం
- ఆందోళనలో రైతులు
- చేన్లలో నీరు నిల్వకుండా చూడాలంటున్న వ్యవసాయాధికారులు



కుంటాల మండలం ఓలాలో ఎరుపు రంగులోకి మారిన పత్తి మొక్కలు, ఇన్‌సెట్‌లో ఎండిన మొక్క

కుంటాల: వ్యయ ప్రయాసాలకోర్చి వ్యవసాయం చేస్తున్న రైతులు ఏటా ఏదో రకరంగా నష్టాలను చవిచూవిస్తున్నారు. రెండు, మూడేళ్ల నుంచి అతివృష్టి, అనావృష్టి కారణంగా దిగుబడులు సరిగా రావడం లేదు. ఈసారి పత్తి పంటకు ఎర్రనల్లి తెగులు సోకడంతో రైతులు దిగాలు చెందుతున్నారు. అప్పులు తెచ్చి పంటలు సాగు చేస్తే కనీసం పెట్టుబడులు రావడం లేదని పలువురు కర్షకులు వాపోతున్నారు.

జిల్లాలో..

ఈ ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో సుమారు లక్షా 56 వేల ఎకరాల్లో పత్తి పంట సాగుచేశారు. జూన్ మాసంలోనే తొలకరి పలకరించడంతో మృగశిర కార్తెకు వారం రోజుల ముందే రైతులు పత్తి విత్తనాలు విత్తారు. వర్షాలకు పంటలు ఆశాజనకంగానే ఉన్నాయి. కానీ 20 రోజుల కిందట కురిసిన అధిక వర్షాలకు పత్తి పంటకు తెగుళ్లు సోకి తెబ్బతింది. ఎర్రనల్లి ఆశించి మొక్క రసాన్ని పీల్చేయడంతో పంట ఎరుపు రంగులోకి మారి, పూత, కాయలు రాలిపోతుంది. ఆకులు సైతం మడతబడి పోతున్నాయి. దీంతో పంటలు ఎండు ముఖం పడుతున్నాయి.

2,160 ఎకరాల్లో నష్టం..

భారీ వర్షాల కారణంగా జిల్లాలో సుమారు 2,160 ఎకరాల్లో పత్తి పంటకు నష్టం వాటిల్లిందని వ్యవసాయాధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. అధిక వర్షాలకు తేమ శాతం ఎక్కువై పత్తి పంటకు తెగుళ్లు సోకడంతో దిగుబడులపై ప్రభావం పడింది. ఇప్పటివరకు పత్తి సాగుకు ఎకరాకు రూ.12వేల నుంచి రూ.15వేల వరకు పెట్టుబడి కోసం ఖర్చు చేశారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులతో సగానికి పైగా దిగుబడి తగ్గుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి సలహాలు, సూచనలు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

రైతులు సత్వరం స్పందించాలి

అధిక వర్షాలకు పత్తి చేనులో మొక్కల వేరు మధ్య నీరు నిలిస్తే ఎర్రనల్లి సోకుతుంది. దీంతో మొక్కకు పోషకాల సరఫరా నిలిచిపోయి ఉన్న ఆకులతోపాటు పూత, కాత రాలిపోతాయి. మల్టీ న్యూట్రియాన్స్ లేదా 19–19–19 నత్రజని, భాస్వరం, పొటాషియం వాడితే ఫలితం ఉంటుంది. రైతులు సత్వరం స్పందిస్తే చేనులోని మొక్కలను కాపాడుకోవచ్చు. సలహాల కోసం సమీపంలోని వ్యవసాయాధికారులను సంప్రదించాలి. – అంజిప్రసాద్, డీఏఓ

18 ఎకరాల్లో సాగు చేశా



18 ఎకరాల్లో పత్తి పంట సాగు చేశా. మొదట్లో పంట బాగానే ఉన్నా.. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతింది. ఎర్ర తెగులు సోకి రెండెకరాల్లో నష్టం వాటిల్లింది.

– యశ్వంత్, దౌనెల్లితండా, మం.కుంటాల

కన్నీళ్లు వస్తున్నాయి



ప్రస్తుతం పత్తి చేను కాత, పూత దశలో ఉంది. ఎర్రనల్లి ఆశించడంతో ఆకులు మడత పడి మొక్కలు ఎండిపోతున్నాయి. పంటను చూస్తే కన్నీళ్లు వస్తున్నాయి. ఏం చేయాలో తోచడం లేదు

– కూస రాజేశ్వర్, ఓలా, మం.కుంటాల

సేవా కార్యక్రమాలు చేపట్టాలి

భైంసాటౌన్: ప్రధాని నరేంద్ర మోదీ పుట్టినరోజు సందర్భంగా నియోజకవర్గంలో 15రోజుల పాటు సేవా కార్యక్రమాలు చేపట్టాలని సేవా పక్షం జిల్లా కోకన్వీనర్ చిన్నారెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని ఎస్ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీలో భైంసా మండల కార్యశాల నిర్వహించారు. ఈనెల 17న అంతటా రక్తదాన శిబిరాలు నిర్వహించాలని, మరో పక్షం రోజులు స్వచ్ఛభారత్, నమో మారథాన్, మొక్కల పెంపకం, మేధావులతో సమావేశం, దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ, సన్మానం, గాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రీ నిర్వహించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సేవాపక్షం కన్వీనర్ ఆనంద్‌రావ్ పటేల్, కోకన్వీనర్ భోజరాం పటేల్, మండల అధ్యక్షురాలు సుష్మ, నాయకులు పాల్గొన్నారు.

అటవీ అమరవీరుల దినోత్సవం



నివాళులర్పిస్తున్న అటవీశాఖ అధికారులు

ఖానాపూర్: పట్టణంలోని ఎఫ్‌డీవో కార్యాలయంలో గురువారం అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా ఎఫ్‌డీవో శివకుమార్ మాట్లాడారు. అడవుల సంరక్షణకు అసువులు బాసిన అమరవీరుల త్యాగాలు మరువలేనివని పేర్కొన్నారు. అడవులు, వన్యప్రాణుల సంరక్షణకు రాత్రనక, పగలనక విధులు నిర్వర్తించి ప్రాణత్యాగం చేసిన వీరులను స్మరించుకునేందుకే ఏటా సెప్టెంబర్ 11న అటవీ అమరవీరుల దినోత్సవం జరుపుకొంటున్నట్లు తెలిపారు. అంతకు ముందు అటవీ అమరవీరుడు టి.సత్యనారాయణ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్‌వో రవీందర్, ఎఫ్ఎస్‌వోలు, ఎఫ్‌బీవోలు ఉన్నారు.

'బాసర అభివృద్ధిపై మాట్లాడే అర్హత లేదు'

భైంసాటౌన్: బాసర అభివృద్ధిపై మాట్లాడే అర్హత మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డికి లేదని బీజేపీ జిల్లా నాయకుడు చిన్నారెడ్డి, ఇతర నాయకులు అన్నారు. గురువారం పట్టణంలోని ఎస్ఎస్ కాటన్ ఫ్యాక్టరీలో మాట్లాడారు. గత బీఆర్‌ఎస్ హయాంలో పదేళ్లు అధికారంలో ఉండి, దేవాదాయ శాఖ మంత్రిగా చేసిన ఇంద్రకరణ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి ఏనాడూ బాసర అభివృద్ధి పట్టించుకోలేదన్నారు. ఇప్పుడు జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లితో కలిసి బాసరకు ఎందుకు వచ్చారని ప్రశ్నించారు. అభివృద్ధిపై పట్టని నాయకులకు నియోజకవర్గంలో తిరిగే అర్హత లేదన్నారు. ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేయకపోతే అడ్డుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు సాయినాథ్ పటేల్, సుష్మరెడ్డి, లక్ష్మారెడ్డి, పట్టణాధ్యక్షుడు రాము తదితరులున్నారు.

'ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘానికి గుర్తింపునివ్వాలి'



మాట్లాడుతున్న రాజేశ్‌నాయక్

నిర్మల్‌రూరల్: తెలంగాణ ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘానికి ప్రభుత్వం గుర్తింపు ఇవ్వాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రాజేశ్‌నాయక్ పేర్కొన్నారు. గురువారం జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఈ మేరకు తీర్మానం చేశారు. ఐదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న తమ దరఖాస్తులు పరిశీలించి గుర్తింపు ఇవ్వాలని కోరుతూ సీఎం కార్యాలయానికి తీర్మానం పంపినట్లు తెలిపారు. తమ సంఘం ఇతర ఉపాధ్యాయ సంఘాలతో సమానంగా సభ్యత్వం కలిగి ఉందన్నారు. ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే తమ సంఘానికి గుర్తింపు నిరాకరించిందని.. దీన్ని పునసమీక్షించాలని కోరారు. ఇందులో ఉపాధ్యాయులు క్రాంతికుమార్, మధుకర్, భిక్షపతి నాయక్, రాందాస్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

యూరియా కోసం నిరీక్షణ

- గోస పడుతున్న రైతులు
- బస్తాలు దొరకక పలువురు నిరాశతో వెనుదిరిగిన వైనం



కుంటాలలో బస్తాల కోసం క్యూలైన్‌లో నిల్చున్న రైతులు, పక్కన పోలీసులు



భైంసారూరల్ : కామోల్‌లో యూరియా కోసం బారులు తీరిన రైతులు

కుంటాల: 13 రోజుల తర్వాత కుంటాల పీఏసీఎస్ కార్యాలయానికి గురువారం 450 యూరియా బస్తాలు రాగా పోలీసుల పహారా నడుమ రైతులకు పంపిణీ చేశారు. ఒక్కో రైతుకు రెండు బస్తాల చొప్పున అందించినట్లు సీఈవో నాగభూషణం తెలిపారు.

భైంసారూరల్: మండలంలోని కామోల్ గ్రామంలో గురువారం యూరియా కోసం రైతులు బారులు తీరారు. యూరియా వచ్చిందనే సమాచారంతో సుమారు 600 మంది గ్రామంలోని డీసీఎంఎస్ కేంద్రానికి చేరుకున్నారు. ఒక్కో పట్టాదారు పాసుపుస్తకంపై రెండు బస్తాలను మొత్తం 450 బస్తాల యూరియాను సగం మంది రైతులకు అందించారు. యూరియా దొరకని వారు నిరాశతో ఇళ్లకు వెనుదిరిగారు. మళ్లీ స్టాక్ తెప్పించి యూరియా ఇవ్వాలని రైతులు వేడుకుంటున్నారు.

ఆంగ్లం చదవడం, రాయడం నేర్పించాలి

తానూరు: విద్యార్థులకు ఆంగ్లం అర్థమయేలా బోధించాలని ఎంఈవో నరేందర్ సూచించారు. గురువారం మండలంలోని ఎల్వి జిల్లా పరిషత్ పాఠశాలలో ముథోల్, తానూరు, కుభీర్, బాసర మండలాల్లోని ఆంగ్ల ఉపాధ్యాయులకు నిర్వహించిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు ఆంగ్లంలో చదవడం రాయడం తప్పనిసరిగా నేర్పించాలని సూచించారు. ఆర్పీలు భూమన్నయాదవ్, రాజేశ్వర్ రెడ్డి, నరేందర్‌కుమార్, ఆంగ్ల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణ పనుల్లో జాప్యం చేయొద్దు



తానూరులో సిబ్బందితో మాట్లాడుతున్న హౌసింగ్ డీఈ దయానంద్



కుంటాల : మాట్లాడుతున్న డీపీవో శ్రీనివాస్

తానూరు: ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు.. వెంటనే నిర్మాణ పనులు ప్రారంభించేలా చూడాలని హౌసింగ్ డీఈ దయానంద్ సిబ్బందిని ఆదేశించారు. అన్నారు. గురువారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇళ్ల నిర్మాణం చేపట్టని లబ్ధిదారులకు అవగాహన కల్పించి పనులు ప్రారంభించేలా చూడాలన్నారు. ఈసందర్భంగా గ్రామాల్లో నిర్మాణ దశలో ఉన్న ఇళ్ల వివరాలను తెలుసుకున్నారు. మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్, ఎంపీడీవో నసీరొద్దీన్, ఏఈ సావిరాం, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

సోన్: గ్రామాల వారీగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు సంబంధించి రికార్డులు సమర్పించాలని ఎంపీడీవో సురేశ్, ఇన్‌చార్జి ఎంపీఓ గోవర్ధన్.. పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. గురువారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఇందిరమ్మ ఇళ్లపై ఏర్పాటు చేసిన సమీక్షలో మాట్లాడారు. అంతకుముందు ఎంపీఓ జాఫ్రాపూర్ గ్రామపంచాయతీ కార్యాలయం సందర్శించారు. రికార్డులు పక్కాగా నమోదు చేయాలని సూచించారు. అనంతరం శానిటేషన్ పనులు, నర్సరీ మొక్కలను పరిశీలించారు. హౌసింగ్ డీఈ, ఏఈ, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

పనులు నాణ్యతతో చేపట్టాలి

కుంటాల: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను నాణ్యతతో చేపట్టి వేగంగా పూర్తి చేయాలని డీపీవో శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని విఠాపూర్ గ్రామంలో లబ్ధిదారులతో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో మాట్లాడారు. అనంతరం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులతో సమావేశమై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో అల్లాడి వనజ, ఎంపీవో ఎంఏ రహీంఖాన్, ఏపీవో గట్టుపల్లి నవీన్, పంచాయతీ కార్యదర్శి ఉత్తం, కమిటీ సభ్యులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఆది కర్మయోగి అభియాన్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారులు

నిర్మల్: ఆది కర్మయోగి అభియాన్ పథకం గిరిజనులకు వరమని ఎంపీడీవో పుష్పలత, ఎంపీఓ తిరుపతిరెడ్డి అన్నారు. నర్సాపూర్ (జి) మండలంలోని అంజనీతండా, బూరుగుపల్లి (జి)తండా గ్రామాల్లో గురువారం ఆది కర్మయోగి అభియాన్ పథకంపై అవగాహన కల్పించారు. గిరిజన ప్రాంతాల్లో ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేసి ప్రజలను భాగస్వాముల్ని చేయడం దీని ఉద్దేశమని పేర్కొన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాజశేఖర్, ఏపీఎం గంగామణి, సూపర్‌వైజర్ లక్ష్మీవిశారద, ఎఫ్‌బీఓ సాయిరెడ్డి, హెచ్‌డబ్ల్యూవో శ్రీనివాస్, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



లక్ష్మణచాంద: మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలకేంద్రంలోని ఊర చెరువు నిండుకుండలా మారింది. అలుగు మత్తడిపై నుంచి పారుతోంది. పలువురు అలుగు వద్దకు వెళ్లి ఫోన్లలో సెల్ఫీలు తీసుకుంటూ సందడి చేస్తున్నారు. గురువారం మధ్యాహ్నం రెండు గంటలపాటు భారీ వర్షం కురిసింది. దీంతో పంట చేన్లలో నీరు నిలిచింది.

ఈరోజు

కంటి వైద్యశిబిరం

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యాలయంలో శుక్రవారం పెన్షనర్లు, వారి కుటుంబసభ్యుల కోసం ఉచిత కంటి వైద్యశిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంసీ.లింగన్న ఓ ప్రకటనలో తెలిపారు. ఈశిబిరం హైదరాబాద్ గ్లోబల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వారు నిర్వహిస్తున్నారన్నారు. కంటి పరీక్షలు, ఆపరేషన్లు చేస్తామని.. పెన్షనర్లు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జీవశాస్త్ర ఉపాధ్యాయుల సమావేశం

లక్ష్మణచాంద: మండలంలోని వడ్యాల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జీవశాస్త్ర ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించనున్నట్లు ఎంఈవో అశోక్‌వర్మ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లక్ష్మణచాంద, మామడ, దిలావర్‌పూర్, నర్సాపూర్(జి) మండలాల జీవశాస్త్ర ఉపాధ్యాయులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

వర్షాలకు కూలిన ఇల్లు



ఇల్లు పరిశీలిస్తున్న ఎంపీడీవో రాధ

లక్ష్మణచాంద: భారీవర్షాలకు మండలంలోని న్యూకంజర్ గ్రామంలో గురువారం పేదకుటుంబానికి చెందిన బంటు సాయవ్వ ఇల్లు కూలి పోయింది. ఈ విషయం తెలిసి ఎంపీడీవో రాధ ఆమె ఇంటిని పరిశీలించి పునరావాస కేంద్రానికి తరలించారు. ఐకేపీ సిబ్బందిని పిలిపించి రూ.లక్ష రుణం మంజూరు చేయాలని ఆదేశించారు. రుణం డబ్బులను వినియోగించుకుని ఇందిరమ్మ ఇంటి నిర్మాణం పూర్తి చేయాలని హౌసింగ్‌శాఖ ఏఈకి సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ అమీర్‌ఖాన్, టీఏ దినేశ్, భీమ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

'ఆప్ ఎమ్మెల్యే అరెస్టు సరికాదు'

నిర్మల్‌టౌన్: జమ్మూలో ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) ఎమ్మెల్యే మేహ్రాజ్ మాలిక్‌ను పబ్లిక్ సేఫ్టీ యాక్ట్ కింద అరెస్ట్ చేయడం సరికాదని.. దీనిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని ఆ పార్టీ జిల్లా కన్వీనర్ సయ్యద్ హైదర్ అన్నారు. గురువారం జిల్లాకేంద్రంలోని ఆమ్ ఆద్మీ పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. ఎమ్మెల్యే అరెస్ట్ ప్రజాస్వామ్యంపై, ప్రజల గొంతుకపై బీజేపీ ప్రభుత్వం చేస్తున్న దాడి అని మండిపడ్డారు. ఇలాంటి బెదిరింపులకు ఆమ్ ఆద్మీ పార్టీ లొంగదన్నారు. ఈ అరెస్టును ప్రజలు, ఇతర రాజకీయ పార్టీల నాయకులు సైతం ఖండించాలని కోరారు. ఇందులో పార్టీ నాయకులు ఉన్నారు.

బాబా ఆలయంలో పూజలు

కుంటాల: మండలంలోని కల్లూరు సాయిబాబా ఆలయంలో గురువారం భక్తులు పూజలు నిర్వహించారు. ఆలయకమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

రేపు రైతువేదికలో ప్రజావేదిక

లోకేశ్వరం: మండల ప్రజాపరిషత్ కార్యాలయ ఆవరణలోని రైతువేదికలో శనివారం ఉదయం 10 గంటలకు ఉపాధిహామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సోలమాన్‌రాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే 2024–25 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన పనులను మండలంలోని 25 గ్రామపంచాయతీల్లో పరిశీలించారు. మండలంలోని అన్ని పార్టీల నాయకులు, ఉపాధి కూలీలు హాజరు కావాలని కోరారు.

ఎంఎల్ఎస్ పాయింట్ డీటీగా రవీందర్‌రెడ్డి

ఖానాపూర్: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో ఉన్న ఎంఎల్ఎస్ పాయింట్ డీటీగా రవీందర్‌రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. అదనపు కలెక్టర్(రెవెన్యూ) కిశోర్‌కుమార్ ఆదేశాల మేరకు ముథోల్ నుంచి ఖానాపూర్‌కు బదిలీపై వచ్చారు. ఖానాపూర్ డీటీగా పనిచేసిన రాకేశ్‌కుమార్ జగిత్యాలకు బదిలీ కాగా ఆయన స్థానంలో రవీందర్‌రెడ్డి బాధ్యతలు చేపట్టారు.

అర్హులకు జాబ్‌కార్డులు అందించాలి

లోకేశ్వరం: అర్హులైన ఉపాధి కూలీలకు జాబ్‌కార్డులు అందించాలని సామాజిక తనిఖీ డీఆర్పీ సునీల్ అన్నారు. గురువారం మండలంలోని ధర్మోరలో ఉపాధిహామీ సామాజిక తనిఖీ గ్రామసభలు నిర్వహించారు. ఈసందర్భంగా డీఆర్పీ సునీల్ మాట్లాడుతూ పనిప్రదేశంలో కూలీలు మాస్టర్‌రోల్‌లో సంతకాలు చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీవో జగన్నాథ్, ఈసీ అనిల్, టీఏ మంజుల, వీఎస్ఏ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ఇళ్లు మంజూరు చేయించాలి

కుంటాల: అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయించాలని కోరుతూ గురువారం మాజీ ఎమ్మెల్యే నారాయణరావు పటేల్‌ను లింబా(కె) గ్రామస్తులు తన నివాసంలో కలిసి వినతిపత్రం అందించారు. అర్హులైన పేదలకు ఇళ్లు మంజూరు చేసేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆత్మ డైరెక్టర్ మహేందర్, గ్రామస్తులు బద్దం శ్రీకాంత్‌రెడ్డి, రాజు, వినాయక్, శ్రీకర్‌రెడ్డి, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో దిగ్విజయ్ దివస్

భైంసాటౌన్: పట్టణంలోని జీఆర్‌పీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం దిగ్విజయ్ దివస్ నిర్వహించారు. ఈసందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ట్రిపుల్‌ఐటీ తెలుగు అధ్యాపకుడు ఉల్లెంగుల ముత్యం మాట్లాడుతూ స్వామి వివేకానంద చికాగో ఉపన్యాసం, యువతలో నింపిన ఉత్తేజం గురించి వివరించారు. యువత వివేకానందుడి మార్గంలో నడవాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు పీజీరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ రఘునాథ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కుంటాల: మండలంలోని కల్లూరు వాసవి కళాశాలలో గురువారం స్వామి వివేకానంద చికాగో సభలో మాట్లాడిన రోజు సందర్భంగా దిగ్విజయ్ దివాస్ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గట్టుపల్లి శ్రీనివాస్, అధ్యాపకులు పాల్గొన్నారు.

పిచ్చిమొక్కలు తొలగింపు

లోకేశ్వరం: మండలంలోని సాథ్‌గాం నుంచి హవర్గ గ్రామం వెళ్లే మార్గంలో రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కలను బిలోలి రామ్‌సేన యూత్ సభ్యులు గురువారం బ్లేడ్ ట్రాక్టర్ సాయంతో తొలగించారు. పెరిగిన పిచ్చిమొక్కలతో ఎదురుగా వచ్చే వాహనాలు కన్పించక ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారని సభ్యులు పేర్కొన్నారు. యూత్ సభ్యులు వినోద్‌కుమార్, హరికృష్ణ, శివకుమార్, అశోక్, భీమేశ్, లక్ష్మీకాంత్, గణేశ్, అకిలేశ్, నరేశ్, కన్నయ్య ఉన్నారు.